VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 03 ఫిబ్రవరి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 165

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

**సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ**

2లో..



# నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దంటే ఎలా?

**అలా చేసినప్పుడు విచారణ తప్పదు.. బీఆర్ఎస్ నేతలపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**

**అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని వ్యాఖ్య**

**నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదన్న ముఖ్యమంత్రి**

**బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారని వ్యాఖ్య**

హైదరాబాద్: రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. “నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్ల వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించింది. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. పశ్నించవద్దని మీరెలా అంటారు అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదు” అని సీఎం స్పష్టం చేశారు.రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

# ఫోన్ ట్యాపింగ్.. కల్పిత కథ



**అక్రమ విచారణలతో దృష్టి మళ్లింపు రాజకీయాలు**

**ఏపీ జలదోపిడీకి సీఎం సహకారం**

**మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్**

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు మేలు చేకూర్చే పనులేవీ చేయలేదని, అన్ని రంగాల్లోనూ విఫలమైందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అబద్ధపు ప్రచారాలు, అక్రమ విచారణలతో దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన కేసీఆర్‌ను విచారణ పేరిట గంటల తరబడి కూర్చోబెట్టడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ధ్వజమెత్తారు. ‘ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు ఏ వ్యాపారవేత్తగానీ, ఏ నటిగానీ ఫిర్యాదు ఇవ్వలేదు. ఇదంతా ఒక కల్పిత కథ. ‘బ్లాక్‌మెయిల్’ అంటూ భారాస మీద ఆరోపణలు చేసేముందు పీసీసీ అధ్యక్షుడు ఒకసారి పునరాలోచించుకోవాలి. భావప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇకనైనా వైఖరి మార్చుకోవాలి’ అని సూచించారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో కేటీఆర్ సోమవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పెట్టుబడులు, దావోస్ సహా అన్ని ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అసెంబ్లీలో చర్చపెట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో భారాస ఘనవిజయం సాధించబోతోందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ రోజులు మళ్లీ గుర్తొచ్చాయి“కేసీఆర్‌ను సిట్ విచారించిన సమయంలో.. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క రోజులోనే దాదాపు 7వేలకు పైగా గ్రామాల్లో భారాస శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. హైదరాబాద్ సహా అన్ని పట్టణాల్లో బైక్ ర్యాలీలు, ఆందోళనలు జరిగాయి. వీటిని దచూస్తుంటే తెలంగాణ ఉద్యమ రోజులు మళ్లీ గుర్తొచ్చాయి. తెలంగాణ కుంభమేళాగా పిలుచుకునే మేడారం జాతర నిర్వహణలోనూ ప్రభుత్వం విఫలమైంది. ఒక మంత్రి కారు అద్దాలను ప్రజలు ఆగ్రహంతో పగలగొట్టే పరిస్థితి వచ్చిందంటే..

ఏస్థాయికి నిర్వహణ దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. దోపిడీలు, లూటీలు, హత్యలు పెరిగిపోయి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి. జలవనరులు, భూములు, బొగ్గు గనులను కాపాడటంలోనూ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. తన పాతబాస్ చంద్రబాబుకు, కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి దాసోహమవుతున్నారు. బనకచర్ల, నల్లమలసాగర్ వంటి కీలక అంశాల్లో తెలంగాణ ప్రయోజనాలు శాశ్వతంగా దెబ్బతినేలా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. సింగరేణి కుంభకోణాలపై సిటింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసినా.. ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదు? ఇందులో ముఖ్యమంత్రి బావమరిది భారీ అక్రమాలకు పాల్పడ్డారు కాబట్టే.. వాస్తవాలు బయటకు రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది.



2లో..

**సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు**

# సరికాదు

**చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు**

**ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా**

**కెసిఆర్ విచారణ తరవాత ప్కటనపై హరీష్ రావు అభ్యంతరం**

## ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే

**దోషులు ఎవరో తేల్చాల్సి ఉంది**

**ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు**

**మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ**

2లో..



**బుల్లెట్ ట్రైన్ హబ్‌గా**

# హైదరాబాద్

**బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్**



న్యూఢిల్లీ: బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులనువివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ – బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ – చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ – పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. కేంద్ర బ్జడెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపును ఆయన వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026–27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు.

అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బ్జడెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.



# వాణిజ్య ఒప్పందానికి ఓకే

- భారత్‌పై సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తున్నాం
- మా వస్తువులపై సున్నా సుంకాలకు, రష్యా చమురు నిలిపివేతకు ఆ దేశం అంగీకరించింది
- మోదీ నాకు గొప్ప స్నేహితుడు
- ప్రధానితో ఫోన్ చర్చల అనంతరం ట్రంప్ ప్రకటన
- 25 శాతం అదనపు సుంకాలూ ఉండబోవన్న శ్వేతసౌధం
- ట్రంప్‌నకు 140 కోట్ల మంది తరఫున కృతజ్ఞతలు.. సుంకాల తగ్గింపుపై మోదీ
- వాణిజ్య ఒప్పందాన్ని
- ప్రస్తావించని ప్రధాని

ట్రంప్ ప్రకటనపై మోదీ స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచీ 18 శాతం అమెరికా సుంకమే అమలు కానుందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇది ఎంతో సంతోషకరమని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. ‘అద్భుత ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరఫున అధ్యక్షుడు ట్రంప్‌నకు చాలా చాలా ధన్యవాదాలు’ అని పేర్కొన్నారు.

2లో..

**గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న**

# కాంగ్రెస్

**బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు**

**ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బిజెపి చీఫ్ రామచంద్రరావు**

2లో..



**కులం కాదు..గుణం చూసి**

# ఓటేయండి

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



2లో..

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# కులం కాదు..గుణం చూసి ఓటేయండి

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతున్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు.రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్



హైదరాబాద్: గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్దిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ది పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

# ప్రజాగ్రహంతోనే అంబటి రాంబాబుపై దాడి



విజయవాడ: ప్రజాగ్రహంతోనే వైసీపీ నేత అంబటి రాంబాబుపై దాడి జరిగిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. భ్రష్టుపట్టిన వైసీపీపై రోజు రోజుకూ ప్రజల్లో వ్యతిరేక పెరుగుతోందన్నారు. ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక కుల, మతాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. వంగవీటి మోహన రంగాతో అంబటి రాంబాబును పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజల కోసం నిలబడిన రంగా స్థాయి ఏమిటి..? రోడ్డుపక్కన అంబోతులా మాట్లాడే అంబటి రాంబాబు స్థాయి ఏమిటి అంటూ ఫైర్ అయ్యారు. ప్రజలు ఆగ్రహంతో అంబటిపై దాడి చేస్తే దాన్ని కులానికి రుద్దే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు.కులానికి అంటగట్టి రాజకీయ లబ్ధి పొందే వైసీపీ కుటిల ప్రయత్నాలను ప్రజలు గమనించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై విమర్శలు చేసే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. అంబటి రాంబాబును ప్రతి ఒక్కరూ చీదరించుకుంటున్నారని తెలిపారు. తాము చాలా సంయమనంతో ఉన్నామన్నారు. సభ్య సమాజం సిగ్గుపడేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అశాంతిని నిలపాలన్నదే లక్ష్యంగా జగన్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను ప్రజలందరూ గమనించాలని మంత్రి కోరారు. పేదల బియ్యం బొక్కేసిన పేర్ని నాని సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడంటూ మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్ అయ్యారు. సొంత భార్య పేరు మీద వ్యాపారం చేసి ఆమెను కేసులో ఇరికించిన వ్యక్తి పేర్ని నాని అంటూ విమర్శించారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వ్యక్తి జోగి రమేష్ అని అన్నారు. 'నా బీసీలు అంటూ జోగి రమేశ్ మాట్లాడుతుండటం హాస్యాస్పదం. గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలమైన మాపై దాడులు, అరెస్టులు జరిగినప్పుడు జోగి రమేశ్ ఏమయ్యారు.. ఏం మేం బీసీలం కాదా' అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య రాకుండా చూస్తున్నామన్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్క వైసీపీ నేతపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు సరికాదు



హైదరాబాద్: చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నొసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు..ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు.

దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సీట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారని ప్రస్తావించారు. వారి కుటుంబ సభ్యులు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఈ నీచానికి ఎవరు ఒడిగట్టారో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. దుశ్చర్యకు పాల్పడ్డవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

# వాణిజ్య ఒప్పందానికి ఓకే



దిల్లీ: భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు.

> **"ప్రధాని మోదీతో మాట్లాడటాన్ని గౌరవంగా భావిస్తున్నా. నాకున్న గొప్ప స్నేహితుల్లో ఆయన ఒకరు. భారత్‌కు ఆయన శక్తిమంతమైన, గౌరవప్రదమైన నాయకుడు. మేం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్ మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై చర్చించాం.**

ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం(ఇందులో రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన 25 శాతం అదనపు సుంకం ఉంది) సుంకాలు 18 శాతానికి తగ్గుతాయి.శ్వేతసౌధం కూడా ఈ అదనపు సుంకాల తొలగింపును ధ్రువీకరించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సోమవారం ట్రంప్ ఫోన్ చేశారు. అనంతరం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో ప్రకటన చేశారు. "ప్రధాని మోదీతో మాట్లాడటాన్ని గౌరవంగా భావిస్తున్నా. నాకున్న గొప్ప స్నేహితుల్లో ఆయన ఒకరు. భారత్‌కు ఆయన శక్తిమంతమైన, గౌరవప్రదమైన నాయకుడు. మేం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా– ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్ మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై చర్చించాం. ఇది ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకగలదని అనుకుంటున్నా. మోదీపై గౌరవంతో ఆయన విజ్ఞప్తిమేరకు వెంటనే వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నా. అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత ప్రధాని కట్టుబడి ఉన్నారు. 500 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లకు అదనంగా మరిన్ని దిగుమతులకు ఆ దేశం సిద్ధంగా ఉంది. వారితో మాకున్న అద్భుతమైన బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ముందుకు సాగనుంది. మోదీ, నేను అన్ని విషయాలను చక్కబెడుతున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనపై మోదీ స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచీ 18 శాతం అమెరికా సుంకమే అమలు కానుందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇది ఎంతో సంతోషకరమని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. 'అద్భుత ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరఫున అధ్యక్షుడు ట్రంప్‌నకు చాలా చాలా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అయితే ఆయన వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించలేదు. 'ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పని చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. ప్రపంచ శాంతికి, సుస్థిరతకు, సుసంపన్నతకు ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతిస్తుంది. రెండు దేశాల భాగస్వామ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చేందుకు ఆయనతో సన్నిహితంగా కలిసి పని చేసేందుకు ఎదురుచూస్తున్నా' అని మోదీ వివరించారు.

# కావాలనే ఎపిలో అల్లర్లకు వైసిపి కుట్ర

న్యూఢిల్లీ: ఏపీలో కావాలనే జగన్ అండ్ కో అల్లర్లు సృష్టించారని బీజేపీ ఎంపీలు సీఎం రమేశ్, పురంధేశ్వరిలు మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించాలన్న కుట్రలు బయటపడ్డాయని అన్నారు. జగన్ కనుసన్నల్లోనే జోగి రమేశ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఎంపీ సీఎం రమేశ్ ధ్వజమెత్తారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో శాంతిభద్రతలు ఉన్నాయా లేదా అనేది కేంద్ర ప్రభుత్వానికి తెలుసన్నారు. మూడు రోజుల నుంచి ఏపీలో జరుగుతున్న పరిణామాలు చూస్తున్నామన్నారు. అంబటి, జోగి రమేశ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబుది కన్‌స్ట్రక్టివ్ మోడ్.. జగన్‌ది డిస్ట్రక్టివ్ మోడ్ అని ఎంపీ రమేశ్ విమర్శించారు. కావాలనే వైసీపీ నేతలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని రమేశ్ ఫైర్ అయ్యారు. వైసీపీ ట్రాప్‌లో ఎవరూ పడొద్దని సూచించారు. కూటమి నేతలు ఎవరూ తప్పు చేయొద్దని కోరారు. సీఎం చంద్రబాబు ఏపీలో శాంతిభద్రతలను కాపాడుతున్నారని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు ఏపీలో సుపరిపాలన అందిస్తున్నారని వెల్లడించారు. ఏపీలో ఉండే వైసీపీ నాయకులకు బ్జడెట్‌పై ఏ మాత్రం అవగాహన లేదని ఎంపీ రమేశ్ అన్నారు. మరోసారి వారు బ్జడెట్ పూర్తిగా చదువుకోవాలని సూచించారు. వైసీపీ నేతలకు ఎంతసేపూ దోచుకోవాలి, దాచుకోవాలనే ఆలోచనేనని ఎంపీ రమేశ్ విమర్శలు చేశారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా అంబటి వ్యాఖ్యలున్నాయని ధ్వజమెత్తారు. చంద్రబాబు తల్లిని అవమానించే విధంగా అంబటి మాట్లాడారని ఆగ్రహించారు. మహిళా లోకం కూడా ఆయన వ్యాఖ్యలను సహించదని తెలిపారు. ఇలాంటి దుశ్చర్యలను సభ్యసమాజం గర్హిస్తుందన్నారు.

# చీరల గురించి కాదు..బడ్జెట్‌పై చర్చించండి

**సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం**

న్యూఢిల్లీ: ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరల పైనా అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరల పైనా చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బ్జడెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా? నేను ధరించే చీరను కూడా బ్జడెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన

విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బ్లౌజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం

# జోగిరమేశ్, అంబటిలపై దాడి ఏ రకమైనా ప్రజాస్వామ్యం

విజయవాడ: మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి ఘటనలో టీడీపీ గూండాలకు పోలీసులకు రక్షణగా నిలిచారని వైఎస్సార్‌సీపీ సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదుగంటల పాటు పోలీసుల సమక్షంలో అరాచకం రాజ్యమేలిందని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నంలోని మాజీ మంత్రి జోగి రమేష్ నివాసంపై టీడీపీ గూండాల దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడిపై పరామర్శించేందుకు జోగి రమేష్ ఇంటికి సజ్జలతో పాటు ఇతర వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లారు. దాడికి సంబంధిచిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు. గుంటూరు పోలీసుల సమక్షంలో అంబటి రాంబాబు ఇంటిపై దాడులు చేశారు. గుంటూరులో టీడీపీ గూండాలు ఏం చేశారో రాష్ట్రప్రజలు చూశారు. టీడీపీ గూండాలకు పోలీసులు రక్షణగా ఉన్నారు. అంబటిని కలిసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు యత్నించారు. అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన పార్టీ నేతల్ని అడ్డుకున్నారు. మాజీ హోంమంత్రి ఫోన్ చేసినా పోలీసులు స్పందించలేదు. బాధితుడినే పోలీసులు అరెస్టు చేశాను. మా నేతలను ఎస్పీ కార్యాలయంలో ఎదుట గంట సేపు ఎదురు చూయించారు. ప్లాన్ ప్రకారం అంబటి రాంబాబు,జోగి రమేష్ కుటుంబ సభ్యులపై దాడి జరిగింది. టీడీపీ గూండాలను పోలీసులు కంట్రోల్ చేస్తున్నట్లు యాక్ట్ చేశారు. జోగి రమేష్ కుటుంబానికి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని సజ్జల ప్రశ్నించారు. బటి,జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేసిన గూండాలపై కేసులు పెట్టలేదు. దాడి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టలేదు. కూటమి నేతల అరాచకాల్ని ఎదుర్కొంటాం. కూటమి అరాచకాల్ని జాతీయ స్థాయికి తీసుకెళ్తాం. చంద్రబాబు వైఎస్సార్‌సీపీ శ్రేణులు,నేతల్ని బెదిరింపులు, దాడులు చేసి బెదిరించాలని అనుకోవద్దు. అలా అనుకుంటే భ్రమే అవుతుంది'అని వ్యాఖ్యానించారు.

# మేడారం జాతర విజయవంతం

**ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక మంత్రి సీతక్క వెల్లడి**

ములుగు: మేడారం సమక్క – సారక్క అమ్మవార్ల మహాజాతర విజయవంతం అయిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్న చిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామన్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క – సారలమ్మ అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. జాతరకు వెళ్తే ఏదో జరుగుతుందని ఓ వర్గం ప్రచారం చేసిందని తెలిపారు. జాతరను తక్కువచేసి చూపాలన్న కుటిల ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ జాతరకు జనం తండోపతండాలుగా తరలివచ్చారని చెప్పుకొచ్చారు. మహాజాతర అనంతరం తాను పారిపోయినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారని ఫైర్ అయ్యారు. తాను పారిపోయేరకం కాదని.. ప్రజల కోసం పంతం నెగ్గించుకునే వ్యక్తినని స్పష్టం చేశారామె. ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే బిడ్డనని చెప్పారు.

# ఐక్యంగా పని చేద్దాం..

## "ఇందూరులో బీజేపీ జెండా ఎగరేద్దాం".

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ పిలుపు.**

**"మన ఇందూర్ మన మేయర్ " అన్న నినాదం ప్రజల్లో నిజమై నిలుస్తోందనీ వెల్లడి.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పంచేసి, "ఇందూరులో బీజేపీ జెండా ఎగరేద్దాం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం బీజేపీ జిలా పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం జరిగిందన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభ్యర్థులంతా ఐక్యంగా పనిచేస్తే ఇందూర్‌లో ఘన విజయం ఖాయం అని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా తాను ఎమ్మెల్యేగా ఇందూర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కాలంలో, నగర అభివృద్ధి కోసం సుమారు రూ.130 కోట్ల నిధులను తీసుకురావడం జరిగిందన్నారు. ఇటీవలి కాలంలో టీయూఎఫ్ఐడీసీ ద్వారా ప్రతి డివిజన్‌కు రూ.1 కోటి చొప్పున అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు.డివిజన్ కి కోటి రూపాయల నిధులతో సమగ్ర అభివృద్ధి పనులు జరగబోతున్నాయనీ, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగించబోతున్నాం అని అన్నారు.అలాగే మున్సిపల్ కార్పొరేషన్ నిధుల ద్వారా రూ.23 కోట్లతో నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు.ఈ సారి ఇందూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పదవి తప్పకుండా భారతీయ జనతా పార్టీదేనని ధీమా వ్యక్తం చేసారు. ఇందూర్ నగరంలో నిర్వహించిన అన్ని సర్వేలు పూర్తిగా బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని వెల్లడించారు. ఇందూర్ ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలనకు మద్దతుగా నిలుస్తున్నారని, అందుకే "మన ఇందూర్ మన మేయర్ " అన్న నినాదం ప్రజల్లో నిజమై నిలుస్తోంది అని తెలిపారు. ఇది కేవలం నినాదం మాత్రమే కాదు, ఇది ఇందూర్ ప్రజల మనసులోని వాస్తవ స్వరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎన్ వి ఎస్ ప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల్లో పోటీ కోసం.. "కన్నకూతురిని చంపిన కసాయి".

**కెనాల్లో దొరికిక బాలిక మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు.**

**వివరాలను వెల్లడించిన సీపీ సాయిచైతన్య.**

**వేగుచుక్క న్యూస్ బోధన్:**



ఎన్నికల్లో పోటీ చేసేందుకు చివరికి కన్న కూతురినే హత మార్చాడు ఓ కసాయి తండ్రి. జిల్లాలోని ఎడపల్లి మండలం, ఏఆర్పీ క్యాంపు శివారులోని కొద్ది రోజుల క్రితం కెనాల్లో దొరికిక బాలిక మృతదేహం కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీపీ సాయిచైతన్య వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు శివారులోని నిజాంసాగర్ డీ 46 కెనాల్ లో ఇటీవల ఓ బాలిక మృతదేహం దొరికింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు టీంలు నిందితుల కోసం దర్యాప్తు చేపట్టారు. బాలికను మహారాష్ట్రలోని ముత్కేడ్ కు చెందిన ప్రాచి కొండమంగలేగా గుర్తించారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి వివరాలు సేకరించారు. బాలికను కన్నతండ్రే హతమార్చినట్లు గుర్తించారు. ముత్కేడ్ తాలూకాలోని కెరుర్ గ్రామానికి చెందిన కొండమంగలే పాండురంగ సెలూన్ నడుపుతూ భార్య ముగ్గురు పిల్లలతో ముత్కేడ్ లో జీవిస్తున్నాడు. అయితే రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కెరుర్ సర్పంచ్ గా పోటీ చేయాలనే భావించాడు. అయితే ముగ్గురు పిల్లలు ఉండడంతో పోటీకి అనర్హుడని అవుతానని అనుకున్నాడు. దీంతో ప్రస్తుత సర్పంచ్ షిండే గణేశ్ తో కలిసి పథకం వేశారు. ముగ్గురు పిల్లల్లో బాబుని ఎవరికైనా దత్తత ఇవ్వాలని అనుకున్నారు. కానీ అప్పటికే అతని పేరు మీద బర్త్ సర్టిఫికెట్ ఉందని నిర్ధారించుకున్నారు. దీనికి గాను పుణె కార్పొరేషన్ ఆఫీసు వెళ్లి బర్త్ సర్టిఫికెట్ మార్చాలని ప్రయత్నం చేశారు.

కానీ బర్త్ సర్టిఫికెట్ మారదని తెలిసిన తరువాత.. ముగ్గురు పిల్లల్లో ఒకరిని చంపేసి తప్పిపోయినట్లు ప్రచారం చేయాలని పథకం రచించారు. ఇందులో భాగంగా పెద్ద కూతురు ప్రాచీని అతని తండ్రి తన బైక్పై ఎక్కించుకుని వచ్చి నిజామాబాద్ జిల్లాలోని ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు శివారు లోని నిజాంసాగర్ డీ 46 కెనాల్లో బాలికను తోసేశాడు. దీంతో చిన్నారి మృతి చెందింది. కేసును చాకచక్యంగా ఛేదించిన బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్సైలు రమ, చంద్రమోహన్, ఏఎస్సై బాబురావు, కానిస్టేబుళ్లు సుధీర్, శ్రీకాంత్ లను సీపీ అభినందించారు.

# ఎట్టకేలకు కాంగ్రెస్ కార్పొరేషన్ అభ్యర్థుల జాబితా విడుదల.

**- రెబల్ అభ్యర్థులను బుజ్జగించే ప్రయత్నం ఫలిస్తుందా.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్పొరేషన్ తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఈ నెల 3 న నామినేషన్ విత్ డ్రా ఉండగా, ఒక రోజు ముందు జాబితా ప్రకటించారు. దీనితో టిక్కెట్ రాని కాంగ్రెస్ ఆశావాహులు రెబల్ గా బరిలో ఉండే అవకాశం ఉంది. దీనితో కాంగ్రెస్ అభ్యర్థులకు కొత్త తలనొప్పులు తప్పవని పలువురు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ నాయకులు రంగులోకి దిగి రెబల్ అభ్యర్థులను బుజ్జగించే ప్రయత్నం ఏమేరకు ఫలిస్తుందో వేచి చూడాలి...

**డివిజన్ ల వారిగా కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు.**

ఒకటో డివిజన్ అగ్గుభోజన్న, రెండో డివిజన్ గుండు అరుణ, మూడో డివిజన్ జక్కుల సంధ్య, నాలుగో డివిజన్ తరుణ్‌కుమార్ నిమ్మగడ్డ, ఐదో డివిజన్ తీగ రమేశ్ రెడ్డి, ఆరో డివిజన్? వేంపల్లి మమత, ఏడో డివిజన్ రామర్తి గోపికృష్ణ, ఎనిమిదో డివిజన్ జిల్లల రమేశ్ 10వ డివిజన్ మహమ్మద్? అన్వర్, 11వ డివిజన్ ఫర్హీన్ బేగం, 12వ డివిజన్ దుమాలె అరుంధతి, 13వ డివిజన్ దరవస్తు హరిచందర్, 14వ డివిజన్ మహమ్మద్ అబ్దుల్ బారీ, 15వ డివిజన్ తూటికూర ప్రీతం, 16వ డివిజన్? అర్జున్? (పంచరెడ్డి దివ్య), 17వ డివిజన్ శారద సంగం, 18వ డివిజన్ క్యాతం హన్మాండ్లు, 19వ డివిజన్ శమంత కాటిపల్లి, 20వ డివిజన్ వడ్డెపు లలిత, 22వ డివిజన్ పుప్పాల లక్ష్మి, 23వ డివిజన్ కొత్త భాగ్యలక్ష్మి, 24వ డివిజన్ అంతరెడ్డి గౌతమి, 25వ డివిజన్ అంతరెడ్డి శ్వేత, 26వ డివిజన్ శివప్రసాద్ సకినాల, 27వ డివిజన్ పెంటి లావణ్య, 28వ డివిజన్ మఠం రేవతి, 29వ డివిజన్? అనీస్ ఫాతిమా, 30వ డివిజన్ మహమ్మద్ సమియొద్దీన్, 31వ డివిజన్ గౌసియా బేగం, 32వ డివిజన్ నస్రీన్ ఫాతిమా, 33వ డివిజన్? సురయ్య జబిన్, 34వ డివిజన్ డివిజన్ వర్ష శారద, 35వ డివిజన్ కోఫూరి జగన్నాథం, 36వ డివిజన్ జక్కుల శ్రీలత విక్కీ, 37వ డివిజన్ కరిపె గుండాజీ లావణ్య, 38వ డివిజన్ ఎల్పుల ప్రవీణ్ యాదవ్, 40వ డివిజన్ సింగారం నరేందర్, 41వ డివిజన్ బొంబొతుల పూజిత గౌడ్, 42వ డివిజన్ కేశ మహేశ్, 44వ డివిజన్ దండు రాజేంద్ర ప్రసాద్, 45వ డివిజన్ కస్తూరి భావని, 48వ డివిజన్ యామగంటి నరేందర్ గౌడ్, 49వ డివిజన్ కూరగాయల ఉమారాణి, 50వ డివిజన్ ధర్మారం అవిన్, 51వ డివిజన్ బాసొల్ల నాగరాజు, 53వ డివిజన్ షాహిన్ బేగం, 54వ డివిజన్ జవేరియా ఫాతిమా, 55వ డివిజన్ బబ్లూ ఖాన్, 56వ డివిజన్? రజియా బేగం, 57వ సుమేరా మెహనాజ్ మజర్, 58వ డివిజన్ అబుబీన్ అబ్దుల్లా, 59వ డివిజన్ రఫత్ ప్రవీణ్, 60వ డివిజన్ అస్రా నజ్మీన్.

# బలూచీ ఆత్మాహుతి దాడిలో 50మది మృతి

**ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నట్లు గుర్తింపు**



ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేథం కొనసాగుతోంది. పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఆత్మహుతి దాడులు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల్లో మృతి చెందారు. బలూచిలోని 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు బాధ్యత వహిస్తూ.. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన వెలువరించింది. పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా 50 మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్ దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అయితే ఆ బాంబర్ పేరును మాత్రం వెల్లడించలేదు. బలోచిస్థాన్ అంతటా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని 'హీరోఫ్' పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించనున్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఆదివారం పేర్కొంది. ఈ విషయంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఆత్మాహుతి దాడుల్లో ఇద్దరు మహిళా నేరస్థులు పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. ఈ దాడులపై బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ స్పందించారు. పాకిస్థాన్ భద్రతా దళాలు 40 గంటలుగా ఉగ్రవాద ఏరివేత చర్యలు కొనసాగిస్తున్నాయని.. ఇందులోభాగంగా ఇప్పటివరకు 140 మందికి పైగా వేర్పాటువాదులను మట్టుబెట్టాయని వెల్లడించారు. స్థానిక పౌరుల వేషధారణలో ఉన్న బలోచ్ రెబల్స్ పాఠశాలలు, బ్యాంకులు, మార్కెట్లు, ఆసుపత్రులలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడుతున్నారని పాక్ మిలిటరీ తెలిపింది. ఏదైనా నగరం లేదా వ్యూహాత్మక స్థావరాన్ని స్వాధీనం చేసుకోవడానికి బలోచ్ రెబల్స్ ప్రయత్నాలు చేస్తున్నాయని.. అయితే వాటిని తమ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని పేర్కొంది.

# చీరల గురించి కాదు.. బడ్జెట్‌పై చర్చించండి

**సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం**

న్యూఢిల్లీ: ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరల పైనా అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరల పైనా చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బ్జడెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా? నేను ధరించే చీరను కూడా బ్జడెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు

. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బ్లౌజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం

# మేడారం జాతర విజయవంతం

**ఊహించిన దానికన్నా పెరిగిన భక్తుల రాక మంత్రి సీతక్క వెల్లడి**



ములుగు: మేడారం సమక్క – సారక్క అమ్మవార్ల మహాజాతర విజయవంతం అయిందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. భక్తులకు చిన్న చిన్న అసౌకర్యాలు కలిగినందుకు చింతిస్తున్నామన్నారు. వీవీఐపీల తాకిడి వల్లే ట్రాఫిక్ జామ్ అయిందని చెప్పుకొచ్చారు. సమ్మక్క – సారలమ్మ అమ్మవార్లతో తమకు భావోద్వేగ బంధం ఉందని మంత్రి సీతక్క ప్రస్తావించారు. అందుకే అన్ని జాగ్రత్తలు చేపట్టామని వివరించారు. జాతరకు వెళ్తే ఏదో జరుగుతుందని ఓ వర్గం ప్రచారం చేసిందని తెలిపారు. జాతరను తక్కువచేసి చూపాలన్న కుటిల ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. అయినప్పటికీ జాతరకు జనం తండోపతండాలుగా తరలివచ్చారని చెప్పుకొచ్చారు. మహాజాతర అనంతరం తాను పారిపోయినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేశారన్ని ÷ర్ అయ్యారు. తాను పారిపోయేరకం కాదని.. ప్రజల కోసం పంతం నెగ్గించుకునే వ్యక్తినని స్పష్టం చేశారామె. ఆదివాసీల అస్తిత్వం కోసం పరితపించే బిడ్డనని చెప్పారు.

# మరింతగా దిగివస్తున్న బంగారం ధరలు

**24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530కి చేరిక**

**22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,38,900**

**రూ.3 లక్షలకు చేరుకున్న కిలో వెండి ధర**



హైదరాబాద్: బంగారం, వెండి ధరలు పెట్టుబడిదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో భారీగా పెరిగిన వెండి, బంగారం ధరలు గత నాలుగైదు రోజులుగా అంతే స్థాయిలో పతనమవుతున్నాయి. ఆల్ టైమ్ గరిష్టానికి చేరుకున్న బంగారం, వెండి ధరల్లో భారీగా లాభాల స్వీకరణ జరుగుతుండడమే దీనికి కారణంగా కనిపిస్తోంది. కొనుగోలుదారులకు ఆనందాన్ని కలిగించకున్నా కొంతమేర దిగివస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,51,530కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే ఏకంగా 9,050 రూపాయలు తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,38,900కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే 8,300 రూపాయలు తగ్గింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,51,680కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల

గోల్డ్ ధర రూ.1,39,050కి చేరుకుంది.మరోవైపు ఇటీవల భారీగా పెరిగిన వెండి కూడా వేగంగా పతనమవుతోంది. ఐదు రోజుల క్రితం రూ.4.25 లక్షలకు చేరిన కిలో వెండి కొద్ది రోజుల్లోనే తిరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే కిలోకు రూ.50 వేల మేర తగ్గింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.3 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా కిలో వెండి ధర రూ.3 లక్షలుగా ఉంది.

# మసిపూసి మారేడుకాయ !

మసిపూసి మారేడుకాయ చేయడమంటే ఇదే. దేశంలో ప్రజల ఆకలిబాధలను, పరిస్థితులను,రోదనలను పట్టించుకోకుండా బడ్జెట్ యధావిధిగా ప్రవేశ పెట్టారు. గత 9 ఏళ్లుగా నిర్మలా సీతారామన్ బడ్జెట్ వల్ల దేశంలో మార్పులు ఏమైనా వచ్చాయా అని చర్చిస్తే..వచ్చాయనే చెప్పాలి. దేశంలో ఆర్థిక మందగమనం సాగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింధి. నిత్యాసవర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఔషధాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కోవిడ్ తరవాత ధరలను పరిశీలిస్తే 200 నుంచి 500 శాతం వరకు ఔషధాల ధరలు పెరిగాయి. సామాన్యునులు వైద్యం చేయించుకునే మాటెలా ఉన్నా..మందులు కొనుక్కొని వేసుకునే దిక్కులేకుండా పోయింది. మరి బడ్జెట్ ప్రగతిశీలమైతే ఇవన్నీ ప్రభావం చూపాలి. చూపడం లేదంటే బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని గుర్తించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పురావడం లేదు. ప్రజల చేతుల్లో డబ్బులు ఆడడం లేదు. సంపాదించింది తిండికి కూడా సరిపోవడం లేదు. ఇలా నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్యులను నిజంగానే వంచించింది. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్థిక సర్వే చేసిన హెచ్చరికలను సైతం బేఖాతరు చేసింది. కొద్దిమంది కోటీశ్వరుల ప్రయోజనాలను రక్షించేదిగా మాత్రమే బడ్జెట్ ఉంది. వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలోఘనంగా చెప్పిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' నిర్దాక్షిణ్యంగా సగటుజీవి పైనుండి దూసుకెళ్ళింది. ఫలితం 53,47,315 కోట్ల రూపాయల బడ్జెట్ సామాన్యులను ప్రమాదంలోకి నెట్టింది. కార్పొరేట్లకు, కోటీశ్వరులకు రాయితీలు, వరాల వర్షం కురిపించి నప్పుడు గుర్తుకురాని ఆర్థిక క్రమశిక్షణ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజానీకానికి మాత్రం గుర్తు చేశారు.



# తగ్గాల్సిందేనా!

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన కెరీర్‌కు కీలకంగా మారిన సినిమా లెనిన్ తో మే 1న ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై 'ఏజెంట్' ఫ్లాప్ తర్వాత అఖిల్ భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇదే తేదీన రామ్ చరణ్ సినిమా 'పెద్ది' విడుదలపై చర్చ నడుస్తుండటంతో బాక్సాఫీస్ క్లాష్ తప్పేలా లేదు. అయితే ఇద్దరి మధ్య స్నేహం నేపథ్యంలో విడుదల తేదీలపై పరస్పర చర్చల తర్వాత స్పష్టత వచ్చే అవకాశముందని సినీ వర్గాలు అంటున్నాయి.

ఇందులో రామ్‌చరణ్ ఆట కూలీగా కనిపించనుండటం ఆసక్తి రేపుతోంది. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా గ్రామీణ నేపథ్యంలో రివేంజ్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ మూవీ తెరకెక్కుతోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. ఇప్పటికే విడుదల చేసిన 'చికిరి చికిరి' సాంగ్ యూట్యూబ్‌లో సెన్సేషన్‌గా మారింది. అన్ని భాషల్లో కలిపి 200 మిలియన్లకు పైగా వ్యూస్ రాబట్టి ఆల్‌టైమ్ రికార్డు క్రియేట్ చేసింది. ఇందులో రామ్‌చరణ్ ఆట కూలీగా కనిపించనుండటం ఆసక్తి రేపుతోంది. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా గ్రామీణ నేపథ్యంలో రివేంజ్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ మూవీ తెరకెక్కుతోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. ఇప్పటికే విడుదల చేసిన 'చికిరి చికిరి' సాంగ్ యూట్యూబ్‌లో సెన్సేషన్‌గా మారింది. అన్ని భాషల్లో కలిపి 200 మిలియన్లకు పైగా వ్యూస్ రాబట్టి ఆల్‌టైమ్ రికార్డు క్రియేట్ చేసింది.

'పెద్ది' మూవీని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27న విడుదల చేస్తామని మేకర్స్ ఎప్పుడో అధికారికంగా ప్రకటించారు. అయితే షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండటంతో విడుదల వాయిదా పడే అవకాశాలున్నాయని టాక్ వినిపిస్తోంది. మొన్నటి వరకు దసరా సీజన్‌కి షిఫ్ట్ అయిందంటూ వార్తలు రాగా ఇప్పుడు మరో డేట్ వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని మే 1 రిలీజ్ చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారట.

మరోవైపు అక్కినేని అఖిల్ నటిస్తోన్న 'లెనిన్' మూవీ కూడా మే 1నే రిలీజ్ కానుండటం చర్చనీయాంశంగా ఉంది. టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి పదేళ్లయినా ఇప్పటికీ ఒక్క హిట్టు కూడా కొట్టలేకపోయినా అఖిల్‌కి 'లెనిన్' మూవీ కీలకంగా మారింది. 'ఏజెంట్' వంటి డిజాస్టర్ తర్వాత ఆయన నటిస్తోన్న చిత్రం కావడం, అందాల తార భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండటంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే 'లెనిన్' రిలీజ్ రోజునే 'పెద్ది' విడుదలైతే అఖిల్ చిత్రానికి కచ్చితంగా పెద్ద దెబ్బేనని చెప్పాలి. 'లెనిన్'కి పాజిటివ్ టాక్ వచ్చినా 'పెద్ది' ప్రభంజనంలో ఆ సినిమా కొట్టుకుపోవడం ఖాయమని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో 'పెద్ది'కి దారిచ్చి 'లెనిన్‌'కి మరో డేట్ చూసుకోవాల్సిందే అన్న అభిప్రాయం వినిపిస్తోంది. అఖిల్, రామ్‌చరణ్ మధ్య మంచి స్నేహం ఉండటంతో ఈ విషయంలో ఇద్దరూ కలిసి చర్చించుకుని ఏదొక నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. మొత్తానికి 'పెద్ది' రిలీజ్‌పై మేకర్స్ మరోసారి అధికారిక ప్రకటన చేస్తే గానీ ఈ కన్ఫ్యూజన్‌కి తెరపడేటట్లు కనిపించడం లేదు.

# కష్టాలు తప్పలేదు



ఆమె కళ్లు మాట్లాడతాయి. ఆమె చిరునవ్వు కోటి భావాలను పలికిస్తుంది. పుష్కర కాలం క్రితం విక్రమ్ 'నాన్న' సినిమాలో చిట్టి పాపగా మనందరి హృదయాలను కొల్లగొట్టిన ఆ చిన్నారి ఇప్పుడు గ్లోబల్ బాక్సాఫీసును షేక్ చేస్తోంది.

రణ్‌వీర్‌సింగ్ సరసన 'ధురంధర్'లో యలినాగా మెప్పించి.. ఇప్పుడు తెలుగులో 'యూఫోరియా'తో పలకరించబోతున్న సారా అర్జున్ సినీ ప్రస్థానం ఇది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ధురంధర్ సృష్టిస్తున్న ప్రభంజనం అంతా ఇంతా కాదు. రూ. 1,300 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ స్పై థ్రిల్లర్‌లో సారా నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. 'జీవితంలో ప్రతి ఒక్కరికీ ఒక యూఫోరిక్ (అత్యంత ఆనందకరమైన) క్షణం ఒకటి ఉంటుంది. నాకు మాత్రం ధురంధర్ సినిమా చూసి అమ్మానాన్నలు కన్నీరు పెట్టుకున్న రోజు అది. నేను చదువులో టాపర్‌గా వచ్చినప్పుడు కూడా వారు అంతలా ఎమోషనల్ కాలేదు. నావల్ల వారు గర్వంగా ఫీలవడం నా కెరీర్‌లో బిగ్గెస్ట్ అచీవ్‌మెంట్" అని చెప్పుకొచ్చింది సారా. సారా తండ్రి రాజ్ అర్జున్ విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నా, ఆమెకు అవకాశాలు వెతుక్కుంటూ రాలేదు. రణ్‌వీర్‌సింగ్ వంటి స్టార్ సరసన నటించే అవకాశం కోసం ఆరు రౌండ్ల కఠినమైన ఆడిషన్ ఎదుర్కోవాల్సి వచ్చింది. క్యాస్టింగ్ డైరెక్టర్ ముకేశ్ ఛాబ్రా వద్ద తాను ఏ సినిమాకు ఆడిషన్ ఇస్తుందో కూడా తెలియకుండానే పెర్ఫార్మ్ చేసి ఈ పాత్రను దక్కించుకుంది. స్టార్ కిడ్ అయినప్పటికీ ప్రతిభను నిరూపించుకుంటేనే అవకాశాలు వస్తాయని సారా నమ్ముతుంది.

సారా దృష్టి ప్రస్తుతం టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ గుణశేఖర్ తెరకెక్కిస్తున్న 'యూఫోరియా'పైనే ఉంది. 'పొన్నియన్ సెల్వన్ తర్వాత విదేశాలకు వెళ్లి సినిమా కోర్సు చేయాలనుకున్నాను. కానీ, యూఫోరియా స్క్రిప్ట్ నా ఆలోచనను మార్చేసింది. ఒక నటిగా నాలోని తపనను ఈ కథ గుర్తించింది. ఇది కేవలం గ్లామర్ సినిమా కాదు, ఒక బలమైన కథ' అని సారా చెప్పుకొచ్చింది. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ధురంధర్ సినిమాలో తనకంటే పెద్దవాడైన రణ్‌వీర్‌సింగ్‌తో రొమాంటిక్ కెమిస్ట్రీపై జరుగుతున్న చర్చలపై సారా చాలా పరిణితితో సమాధానమిచ్చింది. 'కథలో పాత్రల మధ్య వయసు అంతరం ఏంటనేది స్పష్టంగా ఉంది. అది ఆ స్టోరీ డిమాండ్. స్క్రిప్ట్ ప్రకారం ఆ బంధం జస్టిఫైడ్ అని నేను భావిస్తున్నాను. నటిగా పాత్ర ప్రాధాన్యతనే నేను చూస్తాను' అని స్పష్టం చేసింది. 'ధురంధర్ 2'లో తన పాత్ర మరింత

# మరోసారి..





యండమూరి రాసిన 'థ్రిల్లర్' నవల అప్పట్లో 'ముత్యమంత ముద్దు' పేరుతో సినిమాగా వచ్చింది. దానిని రవిరాజా పినిశెట్టి డైరెక్ట్ చేశారు. ఇప్పుడు ఆ నవలను సాయి రాజేశ్ కూడా సినిమాగా తీయబోతున్నారని యండమూరి చెబుతున్నారు.

ప్రఖ్యాత రచయితలు, రచయిత్రులు రాసిన నవలలు సినిమాలుగా రూపుదిద్దుకోవడమన్నది కొన్నేళ్ళ క్రితమే అటకెక్కేసింది. ఇప్పుడు యేడాదికి ఒకటో రెండో నవలా చిత్రాలు వస్తున్నాయి. తెలుగులో గతంలో యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన నవలలు చాలా సినిమాలుగా వచ్చాయి. యండమూరి రాసిన నవలా చిత్రాలైతే సూపర్ హిట్ అయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. యండమూరి రాసిన 'థ్రిల్లర్' నవల 1989లో 'ముత్యమంత ముద్దు' పేరుతో సినిమాగా వచ్చింది. ప్రముఖ నిర్మాత కె. ఎస్. రామారావు సోదరుడు బెనర్జీ నిర్మించిన ఈ సినిమాకు రవిరాజా పినిశెట్టి దర్శకుడు. రాజేంద్ర ప్రసాద్ , సీత జంటగా నటించిన 'ముత్యమంత ముద్దు' అప్పట్లో విమర్శకుల ప్రశంసలు అందుకుంది కానీ కమర్షియల్ గా సక్సెస్ కాలేదు. ఈ చిత్రానికి హంసలేఖ సంగీతం అందించారు. ఆయన స్వరపర్చిన 'ప్రేమలేఖ రాశా నీకంది ఉంటది' సాంగ్ ఇప్పటికీ సంగీతాభిమానుల నోళ్ళలో నానుతూనే ఉంది. యండమూరి తన రెగ్యులర్ ఫార్మాట్ కు భిన్నంగా ఈ నవల రాశారు. దానిని రవిరాజా పినిశెట్టి ఆసక్తికరంగా తెరకెక్కించారు. నటీనటులంతా చాలా బాగా నటించారు. కానీ అప్పటి ప్రేక్షకులు ఈ కథ ఎక్కలేదు. ఇదే నవల ఇప్పుడు సినిమాగా వస్తే బాగుంటుందని చాలామంది అనుకుంటూ ఉంటారు. వారి కోరిక త్వరలోనే తీరబోతోందని తెలుస్తోంది.

ఇటీవల 'ముత్యమంత ముద్దు' సినిమా కథ, కథనం, దానికి ప్రేక్షకుల నుండి లభించిన ఆదరణ వగైరా అంశాలపై సోషల్ మీడియాలో చర్చ జరిగింది. దానికి సమాధానంగా యండమూరి వీరేంద్రనాథ్ ఓ ఆసక్తికరమైన విషయాన్ని తెలియచేశారు. 'ముత్యమంత ముద్దు' సినిమాను ఇప్పుడు ప్రముఖ దర్శకుడు, 'బేబీ' ఫేమ్ సాయిరాజేష్ తెరకెక్కిస్తున్నారని తెలిపారు. 'బేబీ' సినిమా ఘన విజయం తర్వాత సాయి రాజేష్ నిర్మాతగా బిజీ అయ్యాడు. ఆయన నిర్మించిన 'చెన్నయ్ లవ్ స్టోరీ' విడుదలకు సిద్ధంగా ఉంది. ఇందులో కిరణ్ అబ్బవరం, శ్రీగౌరి ప్రియ జంటగా నటించారు. అయితే ఈ సినిమాను మొదట్లో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యతో నిర్మించాలని అనుకున్నారు. కానీ ఆ తర్వాత హీరోహీరోయన్లు మారిపోయారు. కానీ యండమూరి చెప్పినట్టు 'ముత్యమంత ముద్దు'ను సాయిరాజేశ్ ఎప్పుడు తెరకెక్కిస్తారు? ఎవరితో తెరకెక్కిస్తారు? అనేది తెలియాల్సి ఉంది. ఈ తరం ఆడియెన్స్ పల్స్ తెలిసిన సాయి రాజేశ్... యండమూరి 'థ్రిల్లర్' నవలను సినిమాగా తీస్తే అది తప్పకుండా టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా నిలిచే ఆస్కారం ఉంది.

# భారీ ఆశలు

మెగా బ్రదర్ నాగబాబు వారసుడిగా 'ముకుంద' మూవీతో హీరోగా ఎంట్రీ ఇచ్చిన మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మాస్ మూసలో చిక్కుకుపోకుండా విభిన్న చిత్రాలతో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ని సొంతం చేసుకున్నాడు. వరుసగా ప్రయోగాత్మక కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోన్న వరుణ్ తేజ్‌కు ఇటీవల వరుస పరాజయాలు ఎదురవ్వడంతో ఆయనపై కాస్త ఒత్తిడి పెరిగిందనే మాట ఇండస్ట్రీలో వినిపిస్తోంది. వరుస డిజాస్టర్ల తర్వాత ఆయన మార్కెట్, ఇమేజ్ రెండూ ప్రశ్నార్థకంగా మారాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనే సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావాలన్న పట్టుదలతో వరుణ్ తేజ్ కొత్త ప్రాజెక్ట్‌లపై ఫోకస్ పెట్టారు. కెరీర్‌ను మలుపు తిప్పే ఒక బలమైన హిట్ కోసం ఆయన ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

ఈ నేపథ్యంలో వరుణ్ తేజ్ గురించి తాజాగా వినిపిస్తున్న ఓ వార్త సోషల్ మీడియాని ఊపేస్తోంది. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో వరుణ్ తేజ్ సినిమా చేయబోతున్నారనే ప్రచారం నెట్టింట వైరల్‌గా మారింది, 'జవాన్' వంటి భారీ బ్లాక్‌బస్టర్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన అట్లీ ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో భారీ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ మూవీ హాలీవుడ్ రేంజులో తెరకెక్కుతున్నట్లు అప్‌డేట్స్‌ని బట్టి తెలుస్తోంది. ఈ మూవీ తర్వాత వరుణ్ తేజ్‌తో పనిచేసేందుకు అట్లీ ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వరుణ్ కోసం ఇప్పటికే ఆయన ఓ పవర్‌ఫుల్ కమర్షియల్ యాక్షన్ కథను సిద్ధం చేశారనే టాక్ వినిపిస్తోంది. ఈ కాంబినేషన్ నిజమైతే వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ వార్త తెలియగానే ఇదెక్కడి మాస్ కాంబోరా మావా అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినా వరుణ్ తేజ్ మార్కెట్‌పై మళ్లీ పాజిటివ్ బజ్‌ను తీసుకొచ్చిందని చెప్పొచ్చు.



# అన్నయ్య..



ఇండస్ట్రీలో పుకార్లు అనేవి సర్వ సాధారణం. ముఖ్యంగా హీరో హీరోయిన్లు బయట కలిసి కనిపిస్తే వారిమధ్య ఏదో ఉందని రూమర్స్ వచ్చేస్తాయి. అందులో కొన్ని నిజమయినా.. చాలావరకు అబద్ధాలే ఉంటాయి.

ఈమధ్య కాలంలో ఎక్కువగా వినిపించిన రూమర్ ఏదైనా ఉంది అంటే అది బాలీవుడ్ హాట్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ .. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ని పెళ్లాడబోతుందనేదే. సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య రజనీకాంత్ తో విడాకుల తరువాత ధనుష్.. మృణాల్ ఠాకూర్ ప్రేమలో పడిపోయాడని, వీరిద్దరూ కలిసి పార్టీలకు, ఫంక్షన్స్ కి అటెండ్ కూడా అవుతున్నారని బాలీవుడ్ మీడియా తెలిపింది.

ధనుష్,మృణాల్ కలిసి ఉన్న ఫోటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీంతో త్వరలోనే ఈ జంట పెళ్లి పీటలు ఎక్కనుందని వార్తలు వినిపించాయి. దానికి తగ్గట్లే మృణాల్ కూడా ప్రతి వీడియోకి తమిళ్ సాంగ్‌ని పెట్టడం, ఈ వార్తలను ఫన్నీగా తీసుకుంటున్నానని చెప్పడంతో పెళ్లి వార్తలు నిజమే అనుకున్నారు. అంతేకాకుండా ధనుష్ కుటుంబంతో మృణాల్ ఫోటోలు దిగడం, ధనుష్ సోదరి.. మృణాల్ ని ఇన్స్టాగ్రామ్ లో ఫాలో అవ్వడం ఆ వార్తలకు బలాన్ని చేకూర్చాయి.

అయితే తాజాగా మృణాల్ పెద్ద బాంబ్ పేల్చింది. ధనుష్ తనకు అన్నయ్య లాంటివాడని చెప్పి షాక్ ఇచ్చింది. తన పేరుతో ఉన్న అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ధనుష్ తో పెళ్లి వార్తలను ఆమె ఖండించిన్నట్లు ఒక పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. ఆ పోస్ట్ లో ధనుష్ తో తన పెళ్లి అంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మృణాల్ తేల్చిచెప్పినట్లు ఉంది. ఇకనుంచి ఇలాంటి వార్తలను ప్రచారం చేయవద్దని వేడుకొంది. 'నా పని మాత్రమే నన్ను పరిచయం చేస్తోంది. గాసిప్ కాదు అని నేను నమ్ముతాను. ఇటీవల నా పెళ్లి వివాదం అని పిలువబడేది ఆన్‌లైన్‌లో చెలామణి అవుతోంది. నేను దాని గురించి చాలా స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. ధనుష్ ఎల్లప్పుడూ నాకు సోదరుడిలాంటివాడు. మేము పంచుకునేది పూర్తిగా పరస్పర గౌరవం, వృత్తి నైపుణ్యం మాత్రమే.. ఇంకేమీ కాదు. అయితే, ఒక స్త్రీ ప్రయాణాన్ని అంగీకరించడానికి బదులుగా ఆమె వ్యక్తిగత జీవితం గురించి కథనాలను సృష్టించడంలో ప్రజలు ఎందుకు అంత ఆసక్తి చూపుతున్నారో నాకు అర్థం కావడం లేదు.నేను మౌనంగా ఉన్నాను అంటే అది ఏదో దాస్తున్నాను అని కాదు. ఎందుకంటే, నా వ్యక్తిగత జీవితానికి బహిరంగ ధృవీకరణ అవసరం లేదని నేను నమ్ముతాను. ఆడిషన్లు, తిరస్కరణలు, దీర్ఘ రాత్రులు, అచంచలమైన ఆత్మవిశ్వాసం ద్వారా నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నాను. దాని కోసం చాలా కష్టపడ్డాను. ఆ ప్రయాణాన్ని ఒక్క పుకారు తగ్గించడం అన్యాయం. ఈ పుకార్లలో ఎలాంటి నిజం లేదని స్పష్టంగా చెప్తున్నాను' అంటూ ఆమె తెలిపింది. మరి ఇది నిజంగా మృణాలనే చెప్పిందా.. ? లేక ఆమె ఫ్యాన్స్ ఇలా సృష్టించారా..? అనేది తెలియాల్సి ఉంది.



# ఇప్పుడు టొవినో

యంగ్ టైగర్ ఎన్టీఆర్ , మాస్ పవర్.. సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో వస్తున్న చిత్రం 'డ్రాగన్'. బాలీవుడ్ మూవీ 'వార్ 2' మిశ్రమ ఫలితం తర్వాత, తారక్ తన విశ్వ రూపాన్ని చూపించేందుకు నీల్ తో జత కట్టడం తో అంచనాలు అంబరాన్ని తాకుతున్నాయి. ఇప్పు డు ఈ మూవీలోకి మలయాళ పవర్‌హౌస్ పెర్ఫార్మర్ టోవినో థామస్ ఎంట్రీ ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో మంటలు పుట్టిస్తోంది. ఇద్దరు అద్భుతమైన నటుల మధ్య జరిగే ఆ ఎపిక్ ఫేస్-ఆఫ్ ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే ఫ్యాన్స్‌కు పూనకాలు రావడం ఖాయం. ఇక ప్రశాంత్ నీల్ గత చిత్రాలు కేజీఎఫ్, సలార్ లను మించి ఎన్టీఆర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు.మలయాళంలో 'మిన్నల్ మురళి' సినిమాతో పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న టోవినో థామస్. ప్రశాంత్ నీల్ మార్క్ పవర్ ఫుల్ విలన్ గా ఎన్టీఆర్ ను ఢీ కొట్టబోతున్నారు. నీల్ సినిమాల్లో ప్రతినాయకుడి పాత్ర ఎంత బలంగా ఉంటుందో అందరికీ తెలిసిందే. గ్లోబల్ స్టార్ పవర్‌కు, మలయాళ స్టార్ యాక్టింగ్ తోడైతే వెండితెరపై యుద్ధం తథ్యమని సినీ అభిమానులు నమ్ముతున్నారు. ఇది కేవలం క్లాష్ కాదు, అసలైన మాస్ మాడ్‌నెస్! వీరిద్దరి మధ్య వచ్చే 'ఫేస్ ఆఫ్' సీన్లు థియేటర్లను షేక్ చేయడం ఖాయమని సినీ వర్గాల్లో వినిపిస్తోంది.

'వార్-2' మిగిల్చిన వేడిన చల్లార్చుతూ రికార్డుల సునామీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసేందుకు తారక్ సిద్ధమైయ్యాడు. మలయాళ వర్సటైల్ యాక్టర్ టోవినో థామస్ ఈ యుద్ధంలోకి అడుగుపెట్టడంతో, స్క్రీన్ మీద నట విస్ఫోటనం తథ్యమని సినీ వర్గాలు చెబుతున్నాయి. నీల్ మార్క్ డార్క్ విజువల్స్, నరాలను మెలిపెట్టే ఎమోషన్స్ తోడైతే, బాక్సాఫీస్ చరిత్రలో సరికొత్త రక్తచరిత్ర లిఖించబడటం ఖాయమని టాలీవుడ్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మరి తారక్-నీల్ కాంబోలో బాక్సాఫీస్ వద్ద అభిమానుల అంచనాలను అందుకోవడంతో పాటు ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి. కాగా ఇటీవల టోవినో మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేస్తున్న వీడియో తెగ వైరల్ అవగా డ్రాగన్ సినిమా కోసమే సిద్ధమవుతున్నట్లు సోషల్‌మీడియాలో తెగ ట్రెండ్ అయింది.